సాక్షి
కుమురం భీం
గురువారం, 2, మే, 2024



మామిడి ధర ధమాల్

మామిడికాయల ధర పడిపోయింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ మార్కెట్‌లో ఒక్కో టన్నుకు రూ.15వేలు పడిపోవడం ఆందోళనకు గురి చేస్తోంది.

IIలో▸



ఘనంగా మేడే వేడుకలు

కార్మికులు, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. హక్కుల కోసం పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు.

IIIలో▸

గరిష్టం/కనిష్టం
42.9 /26.1

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అధిక వేడితోపాటు తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉంది. రోజంతా ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

‘ఉపాధి’ పనులు పకడ్బందీగా చేపట్టాలి



స్వాగతం పలుకుతున్న అధికారులు

జైనూర్(ఆసిఫాబాద్): గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం పనులు, నర్సరీల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ అన్నారు. మండల కేంద్రంలోని నర్సరీని బుధవారం పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. సెగ్రిగేషన్ షెడ్లలో చెత్త నుంచి సేంద్రియ ఎరువుల తయారు చేసి నర్సరీల్లోని మొక్కలకు అందించాలని సూచించారు. ఐకేపీ ఏపీఎం సుజాత, సిబ్బంది కమిషనర్‌ను శాలువాతో సన్మానించారు. జంగాం గ్రామంలో ఓజా కులస్తులు తయారు చేసే ఇత్తడి వస్తువులను పరిశీలించారు. డీపీవో భిక్షపతిగౌడ్, డీఆర్‌డీవో సురేందర్, ఏపీవో నగేశ్, సీనియర్ అసిస్టెంట్ మోహన్ ఉన్నారు.

బీజేపీలోకి రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్న



వెంకన్నకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఆసిఫాబాద్‌కు చెందిన కోట వెంకన్న బుధవారం జిల్లా కేంద్రంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అలాగే పద్మశాలి సంఘం నాయకులు చిప్ప శ్రీనివాస్, సునీత, కీర్తి, జ్యోతి, సత్తమ్మ, శ్యామల, కమల, తేలికుంట్ల శ్రీధర్, రావులవాడకు చెందిన మహిళలు, యువకులు బీజేపీలో చేరారు. అనంతరం ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రేగుంట కేశవ్‌రావుతో కలిసి పలు కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేయాలంటే.. ప్రతిఒక్కరూ కమలం పువ్వుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేశంలో శాంతి పాలన, అన్నివర్గాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వైకుంఠ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

జైనూర్(ఆసిఫాబాద్): కార్యకర్తలు సైనికుల్లా పని చేసి, కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని దబోలి గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో స్థానిక ఎంపీటీసీ మెస్రం బొజ్జుపటేల్, పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించిన ఘనత కాంగ్రెస్‌దేనని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఓటేసి గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని సూచించారు. మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖీద్, నాయకులు శ్రీనివాస్, ఆయ్యుబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులు షురూ



క్రీడాసామగ్రి పంపిణీ చేస్తున్న డీటీడీవో రమాదేవి, తదితరులు

- 11 ప్రాంతాల్లో 11 మంది కోచ్‌లతో ఉచిత శిక్షణ
- ఈ నెల 31 వరకు వేసవి శిబిరాలు
- ఎండల నేపథ్యంలో ఉదయం, సాయంత్రం నిర్వహణ
- సామగ్రి పంపిణీ చేసిన డీటీడీవో
- క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచన

ఆసిఫాబాద్‌రూరల్: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేందుకు యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేశారు. విద్యార్థులు సెలవులు వృథా చేసుకోకుండా వారికి నచ్చిన క్రీడల్లో శిక్షణ అందించనున్నారు. చిన్నారులు క్రీడల్లో నైపుణ్యాలు పెంచుకోవడంతోపాటు వారిలో మానసికోల్లాసం, స్నేహభావం పెంపొందించేందుకు ఈ శిబిరాలు దోహదపడనున్నాయి. జిల్లాలో బుధవారం నుంచి వేసవి శిక్షణ శిబిరాలను అధికారులు ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో 11 మంది కోచ్‌లకు డీటీడీవో రమాదేవి శిక్షణకు సంబంధించిన క్రీడాసామగ్రిని పంపిణీ చేశారు. నెలరోజుల పాటు అందించే శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని.. క్రీడానైపుణ్యాలు పెంచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, ఎస్సై సోనియా, కోచ్‌లు విద్యాసాగర్, లక్ష్మణ్, రాకేశ్, తిరుపతి, శ్రీనివాస్, సాయి, రవి తదితరులు పాల్గొన్నారు.



గిరిజన ఆదర్శ పాఠశాలలో క్రీడలు ప్రారంభిస్తున్న అధికారులు

ఐదు మండలాల్లో శిబిరాలు

జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్(యూ), తిర్యాణి, రెబ్బెన మండలాల్లో సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్‌లోని గిరిజన క్రీడా పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్, వాసవి పాఠశాల, సిర్పూర్(యూ)లోని తెలంగాణ మోడల్ స్కూల్, కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం మైదానం, సర్‌సిల్క్ రాంమందిర్ సరస్వతి స్కూల్, లక్ష్మీనారాయణ ఆలయం, తిర్యాణి మండలంలోని రొళ్లకన్నెపల్లి, రెబ్బెన మండలం గోలేటిలోని భీమన్న స్టేడియం, సింగరేణి పాఠశాలలో శిక్షణ శిబిరాలు ప్రారంభించారు. మొత్తం 11 మంది కోచ్‌లు 10 క్రీడల్లో ఎంపిక చేసిన వారికి ఈ నెల 1 నుంచి 31 వరకు శిక్షణ అందించనున్నారు. శిక్షణకు అవసరమైన క్రీడా సామగ్రిని ఆయా కోచ్‌లకు అందజేశారు. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బాక్సింగ్, సాఫ్ట్‌బాల్, యోగా, ఫుట్‌బాల్ క్రీడల్లో శిక్షణ అందించనున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. రానున్న వారం రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. ఈ నేపథ్యంలో వేసవి శిక్షణ శిబిరాలు సైతం ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే నిర్వహించనున్నారు. ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు.. మళ్లీ సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటలకు శిక్షణ కొనసాగుతుంది. ఒక్కో శిక్షణ శిబిరంలో 40 మంది క్రీడాకారుల నుంచి 50 మంది వరకు పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. విద్యార్థులకు శిక్షణ అందించే కోచ్‌లకు రూ.4000 చొప్పున అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడానైపుణ్యాలను వెలికి తీసేందుకు యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించాం. ఆయా ప్రాంతాల్లోని క్రీడాకారులు ఈ సమ్మర్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి. అనుభవం కలిగిన కోచ్‌లను నియమించాం. సెలవులను వృథా చేసుకోకుండా తమకు నచ్చిన క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలి.

– మీనారెడ్డి, డీఎస్‌వో

శిక్షణ శిబిరాల వివరాలు

క్రీడలు	వేదిక	కోచ్ పేరు(ఫోన్ నంబర్)
అథ్లెటిక్స్	గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాల, ఆసిఫాబాద్	రాకేశ్(82470 96710)
నెట్‌బాల్	తెలంగాణ మోడల్ స్కూల్, ఆసిఫాబాద్	తిరుపతి(79812 54389)
ఖోఖో	వాసవి స్కూల్, ఆసిఫాబాద్	సాయి(76758 45102)
హ్యాండ్‌బాల్	గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాల, ఆసిఫాబాద్	అరవింద్(95509 09870)
కబడ్డీ	తెలంగాణ మోడల్ స్కూల్, సిర్పూర్–యూ	ధర్మారావు(94417 34946)
సాఫ్ట్‌బాల్	ఎస్పీఎం మైదానం, కాగజ్‌నగర్	గురువేందర్(79812 54389)
బాక్సింగ్	రాంమందిర్ సరస్వతి స్కూల్, కాగజ్‌నగర్	శేఖర్(91771 12942)
యోగా	లక్ష్మీనారాయణ ఆలయం, కాగజ్‌నగర్	ఏడుకొండలు(97040 10779)
వాలీబాల్	రొళ్లకన్నెపల్లి, మం.తిర్యాణి	లక్ష్మణ్(94923 24005)
ఫుట్‌బాల్	భీమన్న స్టేడియం, గోలేటి	కృష్ణగోపాల్(97000 71606)
యోగా	సింగరేణి స్కూల్, గోలేటి	అలేఖ్య(80969 23672)

నేడు జిల్లాకు సీఎం

- జిల్లా కేంద్రంలో జనజాతర బహిరంగ సభ
- మధ్యాహ్నం 2.30 గంటలకు ఆసిఫాబాద్‌కు రేవంత్‌రెడ్డి
- ఏర్పాట్లు పరిశీలించిన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- జన సమీకరణకు కాంగ్రెస్ నాయకుల కసరత్తు



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క, కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు రానున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ పక్కన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే జనజాతర బహిరంగ సభలో ఆయన ప్రసంగించనున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో జిల్లాకు వచ్చిన ఆయన.. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలకు ముందు సీఎం హోదాలో రానున్నారు. ముఖ్యమంత్రి పర్యటన కోసం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. జనజాతర సభకు భారీగా జనాన్ని సమీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రేమల గార్డెన్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో షామియానాలు, బారికేడ్లు, సభావేదిక ఏర్పాట్లు ఇతర వసతులు కల్పిస్తున్నారు.

పటిష్ట బందోబస్తు

ముఖ్యమంత్రి సభకు ఎస్పీ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే సభాస్థలిని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కుమురంభీం చౌక్ నుంచి జన్కాపూర్ చౌరాస్తా వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నందున నేషనల్ హైవే రోడ్డును ఉపయోగించుకోవాలని అధికారులు తెలిపారు. ఆర్టీసీ బస్సులు కూడా హైవే మీదుగా వెళ్లాలని సూచించారు. సభకు హాజరయ్యే ప్రజల బైక్‌లు, కార్లు, ఆటోల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలు కేటాయించారు. వాంకిడి, కెరమెరి నుంచి వచ్చే వాహనాల కోసం టాటియా గార్డెన్, రామాలయం వద్ద, కాగజ్‌నగర్, రెబ్బెన వైపు నుంచి వచ్చే వాహనాల కోసం జుబ్లీ మార్కెట్ సమీపంలో, తిర్యాణి, చిర్రకుంట నుంచి వచ్చే వాహనాల కోసం వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు.

సభాస్థలిని పరిశీలించిన మంత్రి

జనజాతర బహిరంగ సభ ఏర్పాట్లను బుధవారం సాయంత్రం ఉమ్మడి జిల్లా మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల నుంచి సుమారు 35 వేల మంది హాజరు కానున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 14 పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముగ్గురు మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్లు కేటాయించిందన్నారు. ఆదిలాబాద్ స్థానం నుంచి ఆదివాసీ మహిళ ఆత్రం సుగుణ బరిలో ఉన్నారని పేర్కొన్నారు. సీఎం జిల్లా అభివృద్ధికి కంకణం కట్టుకున్నారని, ఓట్ల కోసం కాకుండా జిల్లా అభివృద్ధిలో అగ్రభాగాన ఉంచేందుకు ఇన్‌చార్జి మంత్రిగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులు గతంలో ఎంపీగా పని చేసి, జిల్లా అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. ఈ నెల 5న నిర్మల్ నిర్వహించే భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరవుతున్నారని తెలిపారు. ఈ సభకు సుమారు 60 వేల మంది హాజరవుతారని, జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు అండగా ఉంటూ ప్రజలు దీవించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రూ.60 లక్షల కోట్ల విలువైన ఆస్తులను రూ.6 కోట్లకు అమ్మేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. మంత్రి వెంట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాం నాయక్, నాయకులు మల్లికార్జున్, నరేశ్ జాదవ్, బాలేశ్వర్‌గౌడ్, ఓయూ జేఏసీ నాయకులు అనిల్ కాంబ్లే, అబ్దుల్లా, మీర్ సాబీర్ అలీ, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఎస్పీ సన్నాహక సమావేశం

ముఖ్యమంత్రి సభ భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ సురేశ్‌కుమార్ బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. బందోబస్తుపై పోలీసు ఉన్నతాధికారులతో దిశానిర్దేశం చేశారు. అనంతరం బహిరంగ సభా స్థలం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్, బహిరంగ సభాస్థలి, రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

సూర్య ప్రతాపం



కౌటాలలో ఎండ వేడికి రుమాళ్లు కట్టుకుని వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు

కౌటాల(సిర్పూర్): భానుడు ఉగ్రరూపం దాల్చాడు. పగటి పూట నిప్పులు కక్కుతున్నాడు. ఈ సీజన్‌లో మొదటిసారి ఎండలు బుధవారం ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ దాటాయి. తీవ్రమైన వడగాలులు వీస్తాయని ప్రజలు అప్రమత్తంగా వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. తిర్యాణిలో అత్యధికంగా 45.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా కాగజ్‌నగర్‌లో సైతం 45.6 డిగ్రీల మార్కు దాటింది. తిర్యాణి, కాగజ్‌నగర్ మండలాలు హెచ్చరిక జోన్‌లో ఉండగా మిగతా 13 మండలాలు అలర్ట్ జోన్‌లో ఉన్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయి.. పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లిలో 44.7 డిగ్రీల సెల్సియస్, రెబ్బెన మండలం వంకులంలో 44.5 డిగ్రీలు, కాగజ్‌నగర్ మండలం జంబుగా 44.5, ఆసిఫాబాద్ 44.4, బెజ్జూర్ 44.3, రెబ్బెన 44.3, దహెగాం 44.0, వాంకిడి 43.9, కౌటాలలో 43.8 డిగ్రీలు నమోదైంది.

ఎండలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని, బాధితులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఈ నెల 6 వరకు రాష్ట్రవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. మధ్యాహ్న సమయంలో అత్యవసరమైతే తప్పా బయటకు రావొద్దన్నారు. వడదెబ్బ తగలకుండా తరచూ నీళ్లు తాగాలని, టోపీలు, తలపాగా, కళ్లజోళ్లు ధరిస్తూ.. గొడుగులు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఎండలో పని చేయడం, ఆటలు ఆడడం, ఎండలో నిలిపి ఉంచిన వాహనాల్లో ఉండటం, మద్యం, టీ, కాఫీ ఇతర హాని కలిగించే ద్రవాలు తీసుకోవడం, చెప్పులు లేకుండా బయట తిరగడం వంటి పనులు చేయొద్దన్నారు. ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి తన పరిధిలోని గ్రామాల్లో వడదెబ్బపై అవగాహన కల్పించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే బాధితుడిని వెంటనే చల్లని నీడ ఉండే ప్రదేశానికి తరలించాలని, తడిగుడ్డతో శరీరమంతా తుడవాలని, బాధితుడికి సమీపంలోని ఆస్పత్రికి తరలించాలని సూచించారు. ప్రతీ ఆశ కార్యకర్త వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కూలీలకు నీడ, తాగునీరు, ఓఆర్‌ఎస్, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

మోదీ నాయకత్వమే దేశానికి రక్ష

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, పక్కన ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కౌటాల(సిర్పూర్): మోదీ నాయకత్వమే దేశానికి రక్ష అని బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. కౌటాలలోని జగదాంబ గార్డెన్‌లో బుధవారం ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో దేశంలో ఎలాంటి అలజడులు జరగలేదని, గత కాంగ్రెస్ హయాంలో బాంబు దాడులు అనేకం జరిగాయని ఆరోపించారు. దేశాన్ని 70 ఏళ్లపాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలను మోసం చేసిందన్నారు. కరోనా విపత్తులో ఉచితంగా కరోనా టీకాలు పంపిణీ, రాముడి అక్షింతలు దేశ ప్రజలకు అందజేసిన మోదీకి ప్రజలు రుణపడి ఉన్నారన్నారు. ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి మోదీ రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి రాగానే సిర్పూర్ ప్రాంతాన్ని కేంద్ర నిధులతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తల కోరిక మేరకు సభలో ఆయన మరాఠీ భాషలో మాట్లాడి ఉత్సాహం నింపారు.

సీతక్క పేరిట అక్రమ వసూళ్లు: ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేరిట సిర్పూర్ నియోజకవర్గంలో మామ, అల్లుడు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆరోపించారు. అధికార దాహం తీర్చుకునేందుకు కోనప్ప కాంగ్రెస్‌లో పార్టీలో చేరారని ఎద్దేవా చేశారు. వంద రోజుల్లో సిర్పూర్ నియోజకవర్గంలో రూ.100 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. కౌటాల మీదుగా మహారాష్ట్రలోని గడ్చిరోలి వరకు ప్రత్యేక రైలుమార్గం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జూలైలో ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్‌రెడ్డి జైలుకు పోతారని, ఆగస్టులోగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండదని జోస్యం చెప్పారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టుకు 60శాతం కేంద్ర నిధులు ఇప్పిస్తామని, ప్రాజెక్ట్ నిర్మించి రైతులకు సాగునీరు అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సవాల్ విసిరారు. మే 6న కాగజ్‌నగర్ పట్టణానికి నితిన్ గడ్కారీ వస్తారని తెలిపారు. గోడం నగేశ్‌ను గెలిపిస్తే కేంద్ర గిరిజన మంత్రి అవుతారని చెప్పారు. అనంతరం పలు పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. సమావేశంలో నాయకులు కొంగ సత్యనారాయణ, దోని శ్రీశైలం, బండి రాజేందర్‌గౌడ్, వెంకటేశ్, వీరభద్రచారి, వాను పటేల్, దుర్గం మోతీరాం, సీతల్, లావణ్య, మల్లయ్య, భీమన్న, మిథున్, చందు, మధుకర్, విజయ్, సత్తయ్య, పిట్టల సత్యనారాయణ, తిరుపతి, రవి తదితరులు పాల్గొన్నారు.

అదనపు లైన్ పనులు పూర్తి చేయాలి



సబ్‌స్టేషన్ వద్ద ఎస్‌ఈ వాసుదేవ్

రెబ్బెన: వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాటు చేస్తున్న అదనపు 33 కేవీ లైన్ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆ శాఖ ఎస్‌ఈ(ఆపరేషన్స్) వి.వాసుదేవ్ అన్నారు. నంబాల సబ్‌స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌కు నిరంతరం విద్యుత్ అందించేందుకు భట్టుపల్లి సబ్‌స్టేషన్ నుంచి నంబాల సబ్‌స్టేషన్ వరకు ఏర్పాటు చేస్తున్న అదనపు 33 కేవీ లైన్‌ను పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈ ఇమ్రాన్, సిబ్బంది ఉన్నారు.

ఓటింగ్ పెంచేందుకు ప్రజలను చైతన్యపర్చాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

ఆసిఫాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రజలను చైతన్యపర్చాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పొరపాట్లకు తావు లేకుండా అధికారులు విధులు బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు ప్రత్యేక బృందాలను నియమించాలని.. పోలింగ్ ఏజెంట్లు, బూత్‌స్థాయి అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఓటరు స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనతోపాటు వేసవి దృష్ట్యా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సమకూర్చడం, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద బందోబస్తు చేపట్టాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఎన్నికల విభాగం అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ 70 శాతం పూర్తయిందని తెలిపారు. సమస్యాత్మక, షాడో పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఉద్యోగుల కోసం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఎన్నికల పర్యవేక్షకుడు మధుకర్, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

క్లుప్తంగా

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి(50) మృతిచెందాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల–మందమర్రి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు కింద పడి ఉన్న మృతదేహం లభించింది. మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదు. తల వెంట్రుకలు తెలుపు రంగు, ఒంటిపై క్రీమ్ కలర్ చొక్కా, వంకాయ రంగు ప్యాంట్ ఉన్నాయి. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చారు. వివరాలకు 8328512176 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఆవు దాడిలో బాలుడికి గాయాలు


గణేశ్ తలపై గాయం

దహెగాం: మండల కేంద్రానికి చెందిన గొర్రె గణేశ్ అనే బాలుడిపై ఆవు దాడి చేయడంతో తలకు బలమైన గాయమైంది. గణేశ్ బుధవారం మధ్యాహ్నం ఇంటి ఎదుట ఆడుకుంటున్న సమయంలో ఆవు ఒక్కసారిగా కొమ్ములతో తలపై పొడిచింది. తలకు తీవ్రగాయం కావడంతో వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం గణేశ్‌ను మంచిర్యాలకు తరలించామని కుటుంబ సభ్యులు తెలిపారు.

జైనూర్ ఏవో సస్పెన్షన్

జైనూర్(ఆసిఫాబాద్): విధుల్లో నిర్లక్ష్యం చేసిన జైనూర్ ఏవో పవన్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. మండలంలోని దబోలి గ్రామ పంచాయతీ పరిధిలో ఓ రైతు మృతి చెంది ఏళ్లు గడిచినా బాధిత కుటుంబానికి రైతు బీమా అందకపోవడం, ఎరువుల దుకాణాలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంతో మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు ఆసిఫాబాద్ ఏడీఏ వెంకటి తెలిపారు.

వడదెబ్బతో వృద్ధురాలు మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం వడదెబ్బతో ఐబీ తాండూరుకు చెందిన తోట రాజవ్వ(80) మృతిచెందింది. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. మంచిర్యాల బస్టాండ్‌లో బస్సు దిగిన తర్వాత అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే ఆమె మృతిచెందిందని ధ్రువీకరించారు.

ఎంపీ వెంకటేశ్ నేత కారు తనిఖీ


కారు తనిఖీ చేస్తున్న పోలీసులు

బెల్లంపల్లి: పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత కారును బుధవారం బెల్లంపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. బీజేపీ పక్షాన భీమిని, కన్నెపల్లి మండలాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా బెల్లంపల్లి పోశమ్మ గడ్డ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీమ్–3 పోలీసులు కారును ఆపి నిశితంగా పరిశీలించారు. కారు దిగి ఎంపీ వెంకటేష్ నేత పోలీసులకు సహకరించారు. తనిఖీ అనంతరం ఆయా మండలాలకు వెళ్లారు.

ఎర్రజెండా రెపరెపలు

- ఎరుపెక్కిన సింగరేణి
- ఘనంగా మేడే


శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద నినాదాలు చేస్తున్న ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి క్షేత్రంలో ఎర్రజెండా రెపరెపలాడింది. మే డే సందర్భంగా కార్మిక సంఘాలు ఘనంగా కార్మిక దినోత్సవం నిర్వహించాయి. సీసీసీ కార్నర్‌లోని నరసయ్య భవన్ వద్ద గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య ఎర్ర జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణకు నాటి చికాగో ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని మరోసారి కార్మికవర్గం పాలకవర్గాలపై ఉద్యమించాలన్నారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచీ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సహాయ కార్యదర్శి కిషన్‌రావు పాల్గొన్నారు

కాంట్రాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో..

సింగరేణి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) కార్యాలయం వద్ద యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ జెండా ఆవిష్కరించారు. యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, నాయకులు బుర వీరేశం, ఖాతరాజు ప్రభాకర్, సురేంద్రచారి, తిరుపతి, లక్ష్మి, సమ్మయ్య పాల్గొన్నారు.

కార్మిక వాడల్లో ర్యాలీ..

సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయం నుంచి కార్మికవాడల మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కాంట్రాక్టు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, నాయకులు యాదగిరి కిష్టయ్య, శంకర్, తిరుపతి, సోమయ్య, శ్రీనివాస్, ఐలయ్య కళ లలిత పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో..

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మేడే సందర్భంగా శ్రీరాంపూర్ బస్టాండ్‌లోని కార్మికుడి విగ్రహానికి యూనియన్ సెక్రటరీ జనరల్, రాష్ట్ర మినిమం వేజెస్ కార్పొరేషన్ బోర్డ్ చైర్మన్ బీ.జనక్‌ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెడ్పీ శంకర్‌రావు, జాతీయ సమితి సభ్యులు సీహెచ్.భీమ్‌రావు, కేంద్ర కమిటీ నాయకులు గరిగే స్వామి, కలవేన శ్యామ్, నాయకులు తిరుపతిరెడ్డి, తిరుపతి రాజు, నర్సింగ్ పాల్గొన్నారు.

హెచ్ఎమ్మెస్ ఆధ్వర్యంలో..

హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయం, ఎస్సార్పీ 1 గని వద్ద మే డే దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య ఎర్ర జెండాను ఆవిష్కరించారు. యూనియన్ ఏరియా కార్యదర్శి అనిల్‌రెడ్డి, కేంద్ర నాయకులు దుర్గం లక్ష్మణ్, గొల్ల సత్తన్న, నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

నస్పూర్ కాలనీలోని షిర్కే సెంటర్‌లో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేన శంకర్, పట్టణ కార్యదర్శి మిర్యాల రాజేశ్వరరావు, నస్పూర్ కాలనీలో మండల సహాయ కార్యదర్శి లింగం రవి అరుణపతాకాలు ఎగరవేశారు. పార్టీ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో..

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ బస్టాండ్‌లోని కార్మికుడి విగ్రహం వద్ద శ్రీరాంపూర్ బ్రాంచ్ ఇంచార్జ్ పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి నివాళులర్పించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, యూనియన్ నాయకులు బండి రమేష్, జక్కుల రాజేశం, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


యూనియన్ కార్యాలయం వద్ద అమరులకు నివాళులర్పిస్తున్న సీతారామయ్య



శ్రీరాంపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు


నివాళులర్పిస్తున్న హెచ్ఎమ్మెస్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య

'బీజేపీ పాలనలోనే దేశాభివృద్ధి'


చెన్నూర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చెన్నూర్: బీజేపీ పాలనలోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలు మోదీ నాయకత్వం వైపు మొగ్గు చూపుతున్నారని ఆ పార్టీ పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్‌గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో కుటుంబ పాలన సాగుతోందని, ఇందుకు వెంకటస్వామి కుటుంబమే ఉదాహరణ అని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వివేక్‌వెంకటస్వామి నియోజకవర్గ యువతకు 40 వేల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, నేటికీ నెరవేర్చలేదని తెలిపారు. పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి వెంకటేశ్వర్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండపాక చారి, పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, కౌన్సిలర్ కమ్మల శ్రీనివాస్, గర్రెపల్లి నర్సయ్య, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివకృష్ణ, పట్టణ ఇన్‌చార్జి రత్న లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

'కేంద్రంలో బీజేపీ పక్కా'


మాట్లాడుతున్న ఎంపీ వెంకటేశ్‌నేత

చెన్నూర్: దేశ ప్రజలు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయత్వాన్ని కోరుకుంటున్నారని, కేంద్రంలో పక్కాగా అధికారం చేపడుతుందని పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేశ్‌నేత అన్నారు. పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌కు మద్దతుగా స్థానిక గాంధీచౌక్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఓటు వేసి శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలుపించాలని కోరారు. బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఏనుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న గోవింద్‌చంద్ సర్దార్

నెన్నెల: మహారాష్ట్ర సరిహద్దుల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు ప్రాణహిత తీరం వెంట మన ప్రాంతాలకు మళ్లీ వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కుశ్నపల్లి రేంజ్ అధికారి గోవింద్‌చంద్ సర్దార్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అటవీశాఖ ఆధ్వర్యంలో 'మానవ–ఏనుగులకు మధ్య ఘర్షణ' అనే అంశంపై మండల అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏనుగుల రాకపై గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏనుగులను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించవద్దని, వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఏనుగుల వద్దకు వెళ్లి సెల్ఫీలు తీసుకోవద్దని, వాటిని వెంబడించవద్దని సూచించారు. ఏనుగుల భారీ నుంచి ఎలా తప్పించుకోవాలి, ప్రజలు తమను తాము ఎలా సంరక్షించుకోవాలో వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్, రెవెన్యూ,విద్యుత్, వెటర్నరీ, అటవీ, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని లక్ష్మీకాంతపూర్‌కు చెందిన జిల్లపెల్లి మల్లవ్వ, జెల్లి శ్రీధర్, లక్సెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన రేణి సుమలత, రవి కారులో హైదరాబాద్ ఆసుపత్రికి వెళ్తున్నారు. వీరి కారు కన్నెపల్లి వద్దకు చేరుకోగా ముందు వెళ్తున్న ఓ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఇదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఐషర్ వ్యాను కూడా వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కావడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారందరినీ కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై భూమేష్‌ను సంప్రదించగా, రోడ్డు ప్రమాదం జరిగిందని, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో చదివి పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 10జీపీఏ సాధించిన విద్యార్థులు నవదీప్, రిషితవర్మను కలెక్టర్ బదావత్ సంతోష్ అభినందించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో విద్యార్థులు ఆయనను కలిశారు. భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదవాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో యాదయ్యను కలువగా శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి, పేరెంట్స్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ


రాష్ట్రస్థాయిలో షీల్డ్ అందుకుంటున్న సత్యచతుర్వేది

మంచిర్యాలఅర్బన్: ఖమ్మంలో ఏప్రిల్ 28, 29, 30వ తేదీల్లో జరిగిన టేబుల్ టెన్నిస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో మంచిర్యాల కార్మల్ పాఠశాలకు చెందిన విద్యార్థి సత్యచతుర్వేది విజేతగా నిలిచింది. అండర్–15 విభాగంలో ద్వితీయ స్థానం, డబుల్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ రిన్సీ, యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు.

మామిడి ధర ఢమాల్

- హోల్‌సేల్ మార్కెట్‌లో పడిపోయిన ధైనం
- టన్నుకు గరిష్టంగా రూ.15వేలు తగ్గుదల

నాగ్‌పూర్ మార్కెట్‌లో ధర (టన్ను చొప్పున) రూ.లలో

రకం	నాలుగు రోజుల క్రితం	ప్రస్తుతం
దశేరి	55,000	40,000
బంగెనపల్లి	45,000	30,000
రాటన్	30,000	15,000


కుప్పగా పోసిన మామిడి కాయలు

బెల్లంపల్లి: దేశీయ మార్కెట్‌లో మామిడికాయల ధర ఒక్కసారిగా పడిపోయింది. ఒక్కో టన్నుకు రూ.15వేలు పడిపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. మరోవైపు మహారాష్ట్ర మార్కెట్‌లో బడా వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను దగా చేస్తున్నారు. బెల్లంపల్లిలో రూ.1.18కోట్ల అంచనాతో మ్యాంగో మార్కెట్ నిర్మించి ఏళ్లు గడుస్తున్నా మామిడి ఉత్పత్తుల క్రయవిక్రయాలు సాగడం లేదు. శీతల గిడ్డంగులు లేకపోవడం తదితర కారణాలతో వ్యాపారులు ముందుకు రాలేని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఉన్న దేశీయ మార్కెట్‌కు తరలించి విక్రయించాల్సి వస్తోంది. గత నెల రోజులుగా మామిడికాయల క్రయ విక్రయాలు సాగుతున్నాయి. ప్రారంభంలో దశేరి మామిడి కాయలకు టన్నుకు రూ.90వేలు, బంగెనపల్లి కాయలకు రూ.80వేలు ధర చెల్లించి వ్యాపారులు రైతులకు ఆశలు కల్పించారు. గిట్టుబాటు ధర లభిస్తుందనే ఆశలో మామిడి కోతలు ముమ్మరం చేసి మార్కెట్‌కు రవాణా చేశారు. వారం రోజుల క్రితం నిలకడగా ఉన్న ధరలు క్రమంగా పడిపోతూ వచ్చాయి. బడా వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర తగ్గించి కొనుగోళ్లు చేపట్టారు. దశేరి, బంగెనపల్లి, రాటన్ కాయల ధరలు భారీగా పడిపోయాయి.

పూత విరగబూసి.. పిందె నిలవక

ఈసారి మామిడి చెట్లకు పూత విరగబూసింది. పూతను నిలబెట్టుకోవడానికి రైతులు మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకపోయింది. కొద్దిపాటి పూత మాత్రమే నిలిచింది. పిందె దశ తొడగడానికి ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. తెగుళ్లు, చీడపీడలు ఆశించి, వాతావరణంలో మార్పుల ప్రభావంతో 25శాతం మాత్రమే కాత మిగిలింది. జిల్లాలో 16వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఐదారేళ్ల క్రితం వరకు 18వేల ఎకరాల్లో మామిడితోటలు ఉండగా ప్రకృతి వైపరీత్యాలు, పూత నిలవకపోవడం, పిందె దశను దాటి కాత దశకు వచ్చేసరికి ప్రతికూల పరిస్థితులు తలెత్తడం, యాజమాన్య పద్ధతులు పాటించకపోవడంతోపాటు సస్యరక్షణ చర్యలు చేపట్టక తోటలు నిర్జీవంగా తయారయ్యాయి. అన్నీ అనుకూలిస్తే ఒక్కో ఎకరానికి గరిష్టంగా ఆరు నుంచి ఏడు టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా.. మూడు నుంచి నాలుగు టన్నుల దిగుబడి రావడం గగనంగా మారింది.

ధర లేదు



మామిడి కాయలకు వారం రోజుల క్రితం వరకు ఉన్న ధర కూడా ప్రస్తుతం లేదు. దశేరి, బంగెనపల్లి రకాల మామిడికాయలు బహిరంగ మార్కెట్‌లో కిలోకు రూ.60 నుంచి రూ.70 చొప్పున విక్రయిస్తుండగా హోల్‌సేల్ మార్కెట్‌లో టన్ను ధర సగానికి పడిపోయింది. ఏటా గిట్లనే జరుగుతున్నా వ్యాపారులు, రైతులను పట్టించుకునే వారు లేకుండాపోయారు. – బాబా, మామిడితోటల కాపు లీజు వ్యాపారి

నష్టాలే.. లాభాలు లేవు



ఎంతో కష్టపడి తోటల పెంపకం చేస్తున్నా సరైన లాభాలు రావడం లేదు. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలు, తెగుళ్ల వల్ల కాపు ఆశాజనకంగా ఉండడం లేదు. వచ్చిన పూతను దక్కించుకోవడానికి, మొగ్గ, పిందె దశకు రావడానికి నానా తంటాలు పడాల్సి వస్తుంది. అష్టకష్టాలు పడి పంటను నిలబెట్టుకున్నా వ్యాపారుల మోసాల వల్ల ధర దక్కక తోటలపై ఆశలు వదులుకునే పరిస్థితులు వస్తున్నాయి. – సాటపురి చందు, రైతు, బెల్లంపల్లి

తాండూర్ ఎస్సై సస్పెన్షన్?

తాండూర్: రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారంలో ఆరోపణలు వచ్చిన తాండూర్ ఎస్సై కె.జగదీష్‌గౌడ్ సస్పెండ్ అయినట్లు తెలుస్తోంది. బుధవారం మల్టీ జోన్–1 ఐజీ ఎ.రంగనాథ్ రామగుండం పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ, నేరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పీడీఎస్ బియ్యం అక్రమ దందాపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా తాండూర్ రేషన్ బియ్యం అక్రమ రవాణా ఘటన పై చర్చించినట్లు తెలుస్తోంది. గత నెల 20న తాండూర్ పోలీసులు ఓ వాహనంలో అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్న వ్యవహారంలో భాగస్వాములైన వారు ఏకంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి నెలవారీగా ముడుపులు ఇస్తున్నా బియ్యం పట్టుకోవడం ఏంటని ఎస్సైని నిలదీసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో ఎస్సై పాత్రపై ఆరోపణలు రావడం, కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు నిర్ధారణకు వచ్చి ఐజీ రంగనాథ్ ఎస్సై జగదీష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. కాగా ఈ విషయమై మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్‌ను వివరణ కోరగా తమకు సమాచారం లేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- పెళ్లయిన పది రోజులకే తిరిగిరాని లోకాలకు..


రాథోడ్ మహేందర్ (ఫైల్)


మహేందర్ మృతదేహం

నేరడిగొండ: మండలంలోని బుర్కపల్లి జాతీయ రహదారి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరడిగొండ మండలం లింగట్ల గ్రామానికి చెందిన రాథోడ్ మహేందర్ (25) జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్నాడు. ఉదయం ఆదిలాబాద్‌కు వెళ్లిన ఆయన తిరుగు ప్రయాణంలో బుర్కపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బలమైన గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రోల్‌మామడ గ్రామానికి చెందిన కనక గణేశ్ పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా మృతుడికి గత నెల 21న నిర్మల్ జిల్లాలోని మామడ మండలం రాయదారి గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. పది రోజులు కాకముందే ఇలా మృత్యువాత పడడంతో ఆయా కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అస్వస్థతతో ఆదివాసీ రైతు మృతి


ఆత్రం జంగు మృతదేహం

బోథ్: మండలంలోని పరుపుల పల్లెకు చెందిన రైతు ఆత్రం జంగు అస్వస్థతకు గురై మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగు మంగళవారం కొంత అస్వస్థతకు గురయ్యాడు. సొనాల ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాడు. బుధవారం ఉదయం తాను కౌలుకు తీసుకున్న చేనుకు వెళ్లాడు. ఎండ తీవ్రత నేపథ్యంలో అస్వస్థతకు గురై వెంటనే ఇంటికి చేరుకున్నాడు. ఆ వెంటనే కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించేందుకు యత్నించగా అప్పటికే చనిపోయాడు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఐదుగురు ఆడ పిల్లలు సంతానం ఉన్నారు.

క్లుప్తంగా...

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శివసేనారెడ్డి కోరారు. గాంధీభవన్‌లో బుధవారం ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల యూత్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. సమావేశంలో అభ్యర్థి తీన్మార్ మల్లన్నతో పాటు మూడు జిల్లాల యువజన కాంగ్రెస్ నాయకులు సమావేశమై కార్యాచరణ గురించి చర్చించారు. ప్రతి పట్టభద్రుడిని కలిసి ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఆవశ్యకతను వివరించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ పక్షాన తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఓయూకి నిధులివ్వకుండా బీఆర్ఎస్ నిర్లక్ష్యం

- అధికార ప్రతినిధి చనగాని దయాకర్

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉస్మానియా యూనివర్సిటీకి నిధులు, నియామకాలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేశారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఓయూకు కేసీఆర్ చేసింది శూన్యమని, ఉస్మానియా భూములు అమ్ముకున్నారని మండిపడ్డారు. గతంలో 1,200 మంది అధ్యాపకులు ఉంటే ప్రస్తుతం 320 మంది ఉన్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో జరిగిన భూ లావాదేవీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని దయాకర్ డిమాండ్ చేశారు. ఓయూలో డ్రైనేజీ వ్యవస్థ చాలా దారుణంగా ఉన్నా.. ఒక్క రోజు కూడా పట్టించుకోలేదన్నారు. ఓయూ వందేళ్ల ఉత్సవాల్లో భారీగా అవినీతి జరిగిందని, ఉత్సవాల కాంట్రాక్టు కేటీఆర్ సన్నిహితులకు ఇచ్చారని తెలిపారు. ప్రైవేటు యూనివర్సిటీలకు కేటీఆర్ అనుమతిచ్చి విద్య దోపిడీకి పాల్పడ్డారని దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బస్తర్‌లో నేలకొరిగిన తొలితరం మావోయిస్టు

టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తెలంగాణ నేతలు ● మృతుల్లో చీమల నర్సయ్య, కాసరవెల్లి వినయ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/బెల్లంపల్లి: బస్తర్‌లో మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్–కాంకేర్ సరిహద్దులో టేక్‌మెటా సమీపంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో బస్తర్‌లో నక్సలైట్ ఉద్యమాన్ని ప్రారంభించిన తొలితరం నేతల్లో ఒకరైన చీమల నర్సయ్య ఆలియాస్ జోగన్న, కాసరవెల్లి వినయ్ ఆలియాస్ రవి నేలకొరిగారు. మృతుల ఫొటోలు బయటకు రావడంతో వారి కుటుంబసభ్యులు ఛత్తీస్‌గఢ్‌కు పయనమయ్యారు.



పార్టీ విస్తరణలో నర్సయ్య కీలకపాత్ర

1980వ దశకంలో నక్సలైట్ ఉద్యమం తెలంగాణలో ఊపందుకుంది. కొండపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పట్టు సాధించింది. ఇదే సమయంలో ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం నిర్బంధం పెంచింది. ఈ క్రమంలో తెలంగాణలో తొలి ఎన్‌కౌంటర్ 1982 చివరలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చినమెట్‌పల్లి దగ్గర జరగ్గా, అంకం నారాయణ, మాసం గజేందర్ చనిపోయారు. ఆ వెంటనే 1983 ఫిబ్రవరి 3న పెద్దపల్లి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత గణపతి సమకాలికుడు బయ్యపు దేవేందర్‌రెడ్డి మరణించారు. ఆ తర్వాత ఏప్రిల్‌లో జరిగిన మూడో ఎన్‌కౌంటర్ తెలంగాణ సరిహద్దు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అంకీస దగ్గర జరగగా పెద్ది శంకర్ ప్రాణాలు కోల్పోయారు. దీంతో చైనాలో మావో జెడాంగ్ అనుసరించిన వ్యూహం తరహాలో మైదాన ప్రాంతంతోపాటు అటవీ ప్రాంతంలో మరో షెల్టర్ జోన్ కోసం ఆనాటి నక్సలైట్లు అన్వేషణ సాగించారు. ఈ క్రమంలో బస్తర్ అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని తొలి బ్యాచ్‌ను 1982లో అక్కడకు పంపారు. అలా వెళ్లిన తొలితరం నాయకుల్లో చీమల నర్సయ్య కూడా ఉన్నారు. ఇతని స్వగ్రామం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని జయ్యారం. 42 ఏళ్లుగా బస్తర్‌లో పనిచేస్తూ సాయుధ విప్లవానికి బస్తర్ అడవులను కేంద్ర స్థానంగా నిలపగలిగారు. ఇప్పటికీ 'రెడ్ కారిడార్'కు బస్తర్ కీలకంగా ఉంది.

సికాస నుంచి వినయ్

కాసరవెల్లి వినయ్‌ని పార్టీ అగ్రనేత కటకం సుదర్శన్ శిష్యుడిగా చెప్పుకుంటారు. వినయ్ తండ్రి రాజయ్యకు సింగరేణిలో ఉద్యోగం రావడంతో కుటుంబంతో సహా బెల్లంపల్లికి వచ్చాడు. 1990లో విద్యార్థి ఉద్యమాల ద్వారా వినయ్ విప్లవాల వైపు ఆకర్షితుడయ్యారు. ఆ తర్వాత సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస)లో కీలకంగా పనిచేశారు. నిర్బంధం ఎక్కువ కావడంతో చెన్నూర్ దళంలో కొంతకాలం పనిచేశాడు. విప్లవ విస్తరణ, మిలిటరీ శిక్షణ, ఆయుధాల తయారీ, సాహిత్యం తదితర పనుల కోసం వినయ్‌ని పార్టీ బస్తర్‌కు పంపించింది. 30 ఏళ్లుగా ఆయన బస్తర్‌లో పార్టీని విస్తరించారు. వినయ్ మరణవార్త తెలుసుకొని ఆయన సోదరుడు వెంకటేష్, కుటుంబ సభ్యులు బుధవారం బస్తర్‌కు బయలుదేరారు. గురువారం వినయ్ మృతదేహాన్ని అతడి స్వగ్రామం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి తరలించే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది.

పదిలో 8 మంది గుర్తింపు..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నారాయణపూర్ జిల్లాలోని టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల వివరాలను బస్తర్ పోలీసులు బుధవారం ప్రకటించారు. మొత్తం పది మంది చనిపోగా ఎనిమిది మందిని గుర్తించారు. ఇందులో ముగ్గురు తెలంగాణకు చెందిన వారు ఉన్నారు. మృతుల్లో పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం జయ్యారం గ్రామానికి చెందిన చీమల నర్సయ్య ఆలియాస్ జోగన్న ఆలియాస్ జిసు(66), కాసరబోయిన విన య్ (చెన్నూరు, మంచిర్యాల జిల్లా), సుస్మితా అలియాస్ చైతే (వరంగల్), సంగీత అలియాస్ ఆత్రం డోగే (జోగన్న భార్య, అహేరి, గడ్చి రోలి జిల్లా, మహారాష్ట్ర), సురేశ్ (పశ్చిమ బస్తర్), మల్లేశ్ అలియాస్ మడకం ఉంగా (బస్తర్), పొడి యం కోషి (చింతగుప్ప, సుక్మా), కమ్లీ (కిష్టారం, సుక్మా జిల్లా)లు ఉన్నారు. కాగా, జోగన్న ప్రస్తుతం స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా ఉన్నారు. ఇతనిపై 196 క్రిమినల్ కేసులు నమోదు అవగా రూ.25 లక్షల రివార్డు ఉంది.

7న బీసీ సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం

- ఆర్.కృష్ణయ్య వెల్లడి



కాచిగూడ (హైదరాబాద్): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీసీ సమస్యలపై చర్చించి, ఎన్నికల్లో బీసీలు అనుసరించాల్సిన విధానాలపై తగిన నిర్ణయాలు తీసుకోవడానికి మే 7వ తేదీన కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జాతీయ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహి స్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. ప్రజాస్వామ్య దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పాలక పార్టీలు బీసీలకు ప్రభుత్వంలో వాటా ఇవ్వకుండా కేవలం ఓటు వేసే వ్యక్తులుగానే చూశాయని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలంటే బిచ్చగాళ్లు కాదని, వాటాదారులని పాలక పార్టీలకు తెలిసివచ్చేలా దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీల వాటా బీసీలకు ఇవ్వకపోతే దేశంలో తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. బీజేపీలో ఉన్న బీసీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై, పార్టీ జాతీయ నాయకత్వంపై ఒత్తిడి తెచ్చి బీసీల న్యాయమైన డిమాండ్లు పరిష్కార మయ్యేలా చూడాలని ఆర్.కృష్ణయ్య కోరారు.

పర్యావరణ ప్రతిభా అవార్డులకు పీసీబీ దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్ (హైదరాబాద్): ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) ఆధ్వర్యంలో ప్రతిఏటా అందించే పర్యావరణ ప్రతిభ అవార్డులకు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు సీనియర్ సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ నిషేధం, నీటిపొదుపు, వాయు కాలుష్య నియంత్రణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ అంశాల్లో విశేష కృషి చేస్తున్న సంస్థలకు ఈ అవార్డులు అందిస్తారని పేర్కొన్నారు. ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామపంచాయతీలు, స్వయం సహాయక బృందాలు, పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తమ దరఖాస్తులను సనత్‌నగర్‌లోని టీఎస్‌పీసీబీ పర్యావరణ విద్యా విభాగంలో ఈ నెల 15 లోపు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 91773 03127 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

ఆ ఈవీఎంల వినియోగానికి హైకోర్టు ఓకే

- మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికల ఈవీఎంలు.. లోక్‌సభ ఎన్నికల్లో వాడుకునేందుకు ఈసీకి అనుమతి
- మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ వజ్రేష్‌యాదవ్ పిటిషన్
- విచారణ చేపట్టిన హైకోర్టు.. ప్రతివాదులకు నోటీసులు




సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలు, వీవీప్యాట్లు పార్లమెంట్ ఎన్నికల్లో వాడుకునేందుకు ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు అనుమతి ఇచ్చింది. అలాగే మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 6కు వాయిదా వేసింది. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున మల్లారెడ్డి, కాంగ్రెస్ తరఫున వజ్రేష్‌యాదవ్ పోటీ చేశారు. 33 వేల మెజారిటీతో మల్లారెడ్డి విజయం సాధించారు. అయితే అఫిడవిట్‌లో మల్లారెడ్డి తప్పుడు సమాచారం ఇచ్చారని.. నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలన్నీ ఇవ్వలేదని ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ వజ్రేష్ యాదవ్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. సమీప అభ్యర్థి అయిన తనను ఎమ్మెల్యేగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వజ్రేష్ తరఫున న్యాయవాది సిద్ధ పోగుల దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. ఎన్నికల కమిషన్, మేడ్చల్ ఆర్డీవో, అసెంబ్లీ కార్యదర్శి, మల్లారెడ్డితో పాటు ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. అయితే కేసు కారణంగా గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్లను వాడుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఈసీ మధ్యంతర పిటిషన్ దాఖలు చేయగా, అందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

పల్లా రాజేశ్వర్‌రెడ్డికి నోటీసులు

జనగామ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి (బీఆర్ఎస్) ఎన్నికను సవాల్ చేస్తూ కొమ్మూరి ప్రతాపరెడ్డి(కాంగ్రెస్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమీప ప్రత్యర్థినైన తనను శాసనసభ్యుడిగా ప్రకటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై కూడా న్యాయమూర్తి జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు బుధవారం విచారణ చేపట్టారు. వాదన తర్వాత.. రాజేశ్వర్‌రెడ్డి సహా ఇతర ప్రతివాదులకు న్యాయమూర్తి నోటీసులు జారీ చేస్తూ, విచారణను జూన్ 14కు వాయిదా వేశారు.

దిశ కేసులో పోలీసులకు ఊరట

సిర్పుర్కర్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలపై హైకోర్టు స్టే



సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిశ అత్యాచారం, హత్యకు సంబంధించి నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో పోలీసు అధికారులకు హైకోర్టులో ఊరట లభించింది. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిర్పుర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇప్పుడే ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. తాము తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు స్టే ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేస్తూ, విచారణను జూలై 10కి వాయిదా వేసింది.

ఆ నివేదిక సరిగా లేదంటూ హైకోర్టును ఆశ్రయించిన పోలీసులు

- 2019లో దిశ అత్యాచారం, హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే. ఈ కేసులోని నిందితులను కొద్ది రోజులకే పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఎన్‌కౌంటర్‌పై ఆరోపణలు రావడంతో ఈ ఘటనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సిర్పుర్కర్ కమిషన్‌ను నియమించింది. దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసిన పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కమిషన్ 2022లో అందజేసిన నివేదికలో సూచించింది. పోలీసు అధికారులపై హత్యానేరం కింద కేసులు నమోదు చేసి విచారణ జరపాలని పేర్కొంది. అయితే దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌కు సంబంధించి సిర్పుర్కర్ కమిషన్ ఇచ్చిన నివేదిక సరిగా లేదని, దాని ఆధారంగా తమపై చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్ సహా పలువురు పోలీసులు, ఫరూక్‌నగర్ ఇంచార్జి ఎమ్మార్వో పాండు హైకోర్టును ఆశ్రయించారు.

అప్పటివరకు చర్యలొద్దన్న హైకోర్టు

ఈ పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. సీనియర్ న్యాయవాదులు వేణుగోపాల్, రచనారెడ్డి, హేమేంద్రనాథ్ పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ వరకు అధికారులపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు. కాగా, 'దిశ' ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పలుప్రజాప్రయోజన వ్యాజ్యాలు, రిట్ పిటిషన్లు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే.


విప్లవోద్యమంలో రాలిన ఎర్ర మందారం

- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో కాసవేణ రవి మృతి
- బెల్లంపల్లిలో విప్లవోద్యమ ఓనమాలు
- మూడు దశాబ్దాలకు పైగా అజ్ఞాతం
- ఆదివాసీ పోరాటాలకు నాయకత్వం

బెల్లంపల్లి: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా టేక్‌మెట–కాకూర్ గ్రామాల మధ్య దట్టమైన అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఎర్రమందారం నేలరాలింది. మూడు దశాబ్దాల అజ్ఞాత వాసానికి మృతితో తెరపడింది. మృతిచెందిన పది మంది మావోయిస్టుల్లో బెల్లంపల్లికి చెందిన కాసవేణ రవి ఉరఫ్ అశోక్ ఉరఫ్ వినయ్(48) ఉండడం ఈ ప్రాంతంలో కలకలం రేపింది. చిన్న వయస్సులోనే విప్లవోద్యమానికి ఆకర్శితుడై దండకారణ్య కమిటీ సభ్యుడిగా ఎదిగిన రవి మృతితో బెల్లంపల్లితోపాటు స్వగ్రామం వంగరలో విషాదం నెలకొంది.

సింగరేణి కార్మిక కుటుంబం

హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన కాసవేణ లక్ష్మి, రాజయ్య దంపతులు 1961లో బెల్లంపల్లికి వలస వచ్చారు. రాజయ్యకు సింగరేణి కాలరీస్‌లో ఉద్యోగం రావడంతో బెల్లంపల్లి మున్సిపాల్టీ కన్నాలబస్తీలోని సింగరేణి క్వార్టర్స్‌లో నివాసం ఉన్నారు. వీరికి కుమారులు వెంకటేష్, తిరుపతి, రవి, కూతురు హల్య ఉన్నారు. అందరికంటే చిన్నవాడైన రవి విప్లవోద్యమంలోకి వెళ్లిన తర్వాత రాజయ్య 2001లో కార్మికుడిగా రిటైర్డు అయ్యాడు. అనంతరం స్వస్థలం వంగరకు వెళ్లి అక్కడే స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు.



ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన రవి

బాల్యంలోనే విప్లవబాట

రవి స్థానిక టేకులబస్తీ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల(హౌజ్‌ల బడి)లో 7వ తరగతి వరకు చదివాడు. 8వ తరగతి కోసం బజార్ ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరాడు. 9వ తరగతి నుంచి విప్లవోద్యమాలకు ఆకర్శితుడయ్యాడు. అప్పటి పీపుల్స్‌వార్ అనుబంధ సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస)లో మిలిటెంట్‌గా పని చేశాడు. సికాస శ్రేణులకు కొరియర్‌గా పని చేస్తూ పోలీసుల నిర్బంధంలో ఎంతో నేర్పుగా వాల్‌పోస్టర్లు వేయడంలో దిట్టగా పేరుగాంచాడు. గంగారాంనగర్ బస్తీ ఏర్పాటు, పేదలకు ఇళ్లస్థలాల పంపిణీ కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరించాడు. ఈ క్రమంలో చదువుపై దృష్టి సారించకపోవడంతో పదో తరగతి తప్పాడు. దీంతో పెద్దన్న వెంకటేష్ రవిని మందలించాడు. అప్పటికే సికాస కార్యకలాపాల్లో రవి పేరు బెల్లంపల్లిలో మారుమోగడంతో పోలీసులు వెతకడం తీవ్రతరం చేశారు. 16ఏళ్ల ప్రాయంలో విప్లవోద్యమానికి జీవితం అంకితం చేసి 1993లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. చెన్నూర్ దళంలో కొంత కాలం పని చేసిన తర్వాత ఉద్యమ అవసరాల రీత్యా దండకారణ్యంలోకి వెళ్లి ఉద్యమ వ్యాప్తికి తన వంతు పాత్ర పోషించాడు.

భౌతికదేహం కోసం వెళ్లిన కుటుంబీకులు

రవి భౌతిక దేహాన్ని తీసుకు రావడానికి సోదరుడు వెంకటేష్, సన్నిహితులు, బంధువులు ఛత్తీస్‌గఢ్‌కు బుధవారం వెళ్లారు. గురువారం రవి భౌతికకాయంతో స్వగ్రామం వంగరకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అంత్యక్రియలు వంగరలోనే నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

అంచెలంచెలుగా దండకారణ్య కమిటీ సభ్యుడిగా ఎదిగి..

సాధారణ కార్యకర్తగా సికాసలో చేరిన రవి మిలిటెంట్‌గా రూపాంతరం చెందాడు. బెల్లంపల్లి కోల్‌బెల్ట్ ప్రాంతంలో వివిధ హోదాల్లో పని చేసి మూడు దశాబ్దాలకు పైగా దండకారణ్యం కేంద్రంగా విప్లవ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. పోలీసు ఎదురు కాల్పుల్లో ఎన్నోసార్లు చాకచక్యంగా తప్పించుకున్నాడు. దండకారణ్యంలో ఆదివాసీలతో దండు కూడగట్టాడు. మావోయిస్టు పార్టీలో దండకారణ్య కమిటీ సభ్యుడి స్థాయికి ఎదిగాడు. విప్లవ ప్రస్థానంలో సవాళ్లతో సహవాసం చేస్తూ అడవుల్లో అస్తమించి అమరుడయ్యాడు.

జిజ్ఞాస పోటీల్లో మొదటి బహుమతి



బహుమతి పొందిన విద్యార్థినులు



ప్రశంసపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

కరీంనగర్ సిటీ: హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో కరీంనగర్ మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థినులు మొదటి బహుమతి గెలుచుకున్నారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ సంస్కృతి ఆడిటోరియంలో బుధవారం బహుమతి ప్రదానం చేశారు. కళాశాల ఉర్దూ విభాగం నుంచి ఖలీం మొహియుద్దీన్ ఆధ్వర్యంలో విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు తెలంగాణ మెయిన్ ఉర్దూగా ఫెస్టివల్ నిజామీతలీమ్ ప్రథమ స్థానంలో నిలిచింది. కళాశాల విద్య కమిషనర్ బుర్ర వెంకటేశం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీలక్ష్మి, ప్రాజెక్టు సూపర్‌వైజర్, విద్యార్థినులకు బహుమతితోపాటు రూ.30 వేలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కళాశాల విద్య కమిషనర్ కార్యాలయ ఏజీవో బాలభాస్కర్, జాయింట్ డైరెక్టర్ రాజేందర్ సింగ్, ఆర్‌జేడీ యాదగిరి, రూసా కో–ఆర్డినేటర్ సౌందర్య జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ విద్యార్థులకు తృతీయ..

హిందీ సహ ఆచార్యుడు వి.వరప్రసాద్ పర్యవేక్షణలో మహమ్మద్ ముజు తబా, మహమ్మద్ ఆసిఫ్, షేక్ షర్జీల్, సయ్యద్ ఖాజా మొయినుద్దీన్, సర్దార్ మన్‌ప్రీత్ సింగ్ తదితర విద్యార్థులు సోషల్ మీడియాలో హిందీ భాష : ఒక అధ్యయనం(వాట్సాప్, ఫేస్ బుక్‌లకు ప్రత్యేకంగా) అనే ప్రాజెక్టు రూపొందించారు. ఇది తృతీయ బహుమతి గెలుచుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, స్టాఫ్ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు వారిని అభినందించారు.

అగ్రహారం విద్యార్థులకు ద్వితీయ బహుమతి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు ఇటీవల కళాశాల విద్యాశాఖ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుల పోటీలలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతి అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ 'ఇంపాక్ట్ ఆఫ్ రైతుబంధు స్కీమ్ ఆన్ ఫార్మర్స్, ఏ స్టడీ ఆఫ్ రాజన్నసిరిసిల్ల డిస్ట్రిక్ట్' అనే అంశంపై స్టడీ ప్రాజెక్టు రూపొందించారు. రాష్ట్రస్థాయిలో పోటీపడ్డ 20 ప్రాజెక్టులలో అగ్రహారం విద్యార్థుల ప్రాజెక్టు రెండో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. జిజ్ఞాస పోటీలలో ద్వితీయ బహుమతి సాధించిన కామర్స్ అధ్యాపకులు మల్లారెడ్డి, విద్యార్థులు వి.సుష్మ, ఎం.లహరిక, రాజేశ్, యశ్వంత్, అనిరుధ్‌లను అభినందించారు.

రామగుండంలో భారీగా యూరియా ఉత్పత్తి



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్) కర్మాగారంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించారు. గత ఏప్రిల్‌లో 1,14,002.82 మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేసి రికార్డు సాధించామని సీజీఎం సుధీర్‌కుమార్ ఝా తెలిపారు. ఇంతవరకు తెలంగాణ సహా ఇతర రాష్ట్రాలకు అత్యధికంగా యూరియా సరఫరా చేశామని వివరించారు.

యూరియా సరఫరా తీరు ఇలా(మె.ట)

రాష్ట్రం	సరఫరా
తెలంగాణ	35,332.65
ఆంధ్రప్రదేశ్	8,407.98
కర్ణాటక	20,319.75
మహారాష్ట్ర	14,649.12
ఛత్తీస్‌గఢ్	13,526.37
తమిళనాడు	13,520.43
మధ్యప్రదేశ్	8,246.52

ఎన్టీపీసీ బూడిదను వదలని మంత్రి 'పొన్నం'




మాట్లాడుతున్న ఎస్సీమోర్చా జాతీయ ప్రధానకార్యదర్శి ఎస్.కుమార్, చిత్రంలో రాణిరుద్రమ తదితరులు

- బండి చేసిన అభివృద్ధిని ఓర్వలేకనే ఆరోపణలు
- బీజేపీ నేతలు ఎస్.కుమార్, రాణి రుద్రమ

కరీంనగర్‌టౌన్: ఎన్టీపీసీ బూడిదను వదలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకే అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ ఎస్సీమోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో మాట్లాడుతూ.. బీజేపీ 400 సీట్లకు పైగా గెలుస్తుందని తెలిసి పొన్నం కాలుకాలిన పిల్లిలా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. పొన్నం ప్రభాకర్ పెద్ద అవినీతిపరుడని, ఓ ట్రావెల్స్ అధినేత నుంచి రూ.కోటిన్నర విలువైన కారుతో పాటు ఎన్టీపీసీ బూడిద నుంచి లంచాలు తీసుకున్న ఘనత పొన్నందే అన్నారు. బూడిద తీసుకెళ్లే లారీలను ఆపేసి కాంట్రాక్టర్‌ను బెదిరించి తొలుత రూ.2 కోట్లు, తరువాత మరో రూ.6 కోట్లు ఆయనతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బూడిద స్కాంపై సీబీఐ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. నాయకులు కన్నబోయిన ఓదెలు, రమణారెడ్డి, లోకేశ్, బొంతల కల్యాణ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో స్కాన్ అండ్ షేర్



స్కాన్ అండ్ షేర్‌ను ప్రారంభిస్తున్న రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆసుపత్రితో పాటు సూపర్ స్పెషాలిటీలోనూ స్కాన్ అండ్ షేర్ క్యూఆర్ కోడ్ విధానం అమల్లోకి తెచ్చారు. పేషెంట్లు రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి నిరీక్షించి ఉండకుండా ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆండ్రాయిడ్ మొబైల్ కలిగి ఉన్న వారు ప్లేస్టోర్ ద్వారా ఏబీహెచ్ఏ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ వివరాలు నమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ టోకెన్ నంబర్ వస్తోంది. కౌంటర్ వద్ద ఆ నంబర్ చెబితే సరిపోతోంది. వివరాలన్నీ అందులోనే నిక్షిప్తమై ఉంటాయి. సంబంధిత వైద్యుడి వద్దకు వెళ్లి అవసరమైన చికిత్స పొందవచ్చు. ఈ విధానాన్ని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్ఎంవో చందు, ఆయుష్మాన్ భారత్‌మిషన్ సిబ్బంది రేణుక, అశ్విన్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలి



కాంపోస్టు షెడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ అనిత రాజేంద్రన్

- పంచాయతీరాజ్ రాష్ట్ర కమిషనర్ అనిత రాజేంద్రన్

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించాలని పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర కమిషనర్ అనిత రాజేంద్రన్ అన్నారు. మండలంలోని ముత్నూర్ గ్రామాన్ని బుధవారం సందర్శించారు. కాంపోస్టు షెడ్డును సందర్శించి తడి, పొడి చెత్త సేకరణపై ఆరా తీశారు. అనంతరం నర్సరీ, పల్లె ప్రకృతి వనంను పరిశీలించారు. వారి వెంట డీఆర్డీవో సాయన్న, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో జీవన్, ఏపీవో జాధవ్ శ్రీనివాస్ తదితరులున్నారు.

పీఆర్ పథకాలు పటిష్టంగా అమలు చేయాలి

గుడిహత్నూర్: పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపడుతున్న పలు పథకాలు, కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ అనితా రామచంద్రన్ అన్నారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆమె తోషంలో నిర్వహిస్తున్న ఎరువుల తయారీ కేంద్రం, మొక్కల నర్సరీని పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట డీఎల్పీవో ఫణిందర్, డీఆర్డీవో సాయన్న, ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్‌హై, ఏపీవో శామ్యూల్, కార్యదర్శి లావణ్య తదితరులున్నారు.